జగన్నాథపురంలో దారుణం

ప్రైవేటు లేఅవుట్ ధ్వంసం చేసి గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- లబోదిబోమంటున్న ప్లాట్ల యజమానులు

- వార్త 7వ పేజీలో..



పరిహారమా.. పరిహాసమా!

మిచౌంగ్ తుఫాన్‌కు జిల్లాలో తీవ్రంగా పంట నష్టం

వివిధ నిబంధనలు, వడపోతల అనంతరం సుమారు 16,472 ఎకరాలకు నష్టం జరిగినట్టు అధికారులు గుర్తింపు



అనకాపల్లి మండలం శంకరం పరిసరాల్లో నీట మునిగిన పంట (ఫైల్)

- 28,248 మంది రైతులకు సుమారు రూ.11.29 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రెండు నెలల క్రితం బటన్ నొక్కిన సీఎం జగన్
- ఇప్పటికీ అందని పరిహారం
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- సర్కారు తీరుపై ఆవేదన

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపుల్లోనూ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు పంట కోల్పోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కినా ఇప్పటికీ పరిహారం అందక అవస్థలు పడుతున్నారు. పంట నష్టపరిహారం ఎప్పుడు అందుతుందా? అని రైతులు ఆశతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే, మిచౌంగ్ తుఫాన్ ధాటికి పంటలకు నష్టం వాటిల్లింది. గతేడాది డిసెంబరు నెలలో మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు జిల్లాలో ఎక్కువగా అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. పంట నష్టం అంచనాలు వేయడంలో రకరకాల నిబంధనలు తెరపైకి తెచ్చిన ప్రభుత్వం అప్పట్లో క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి వడపోతల ద్వారా లబ్ధిదారులను తగ్గించి, నష్టపోయిన రైతుల జాబితాను రూపొందించింది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 16,472 ఎకరాల్లో వరి, చెరకు పంటలతో పాటు 291 మంది రైతులకు చెందిన 131 ఎకరాల్లో ఉద్యాన పంటలైన అరటి, తమలపాకులు, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో సుమారు 16,472 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. 28,248 మంది రైతులకు రూ.11,29,89,000 విలువ చేసే పంట నష్టం జరిగినట్టు వ్యవసాయాధికారులు తేల్చారు. ఈ మేరకు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఈ ఏడాది జనవరి రెండో వారంలో ప్రభుత్వానికి నివేదించారు.

బటన్ నొక్కినా డబ్బు పడలేదు

ఈ ఏడాది మార్చి 6న సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి పరిహారం నిధులు విడుదల చేస్తూ బటన్ నొక్కారు. అయితే ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే, తుఫాన్ కారణంగా నష్టపోయామని, తీరా ప్రభుత్వం చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ... మిగతా 8వ పేజీలో

హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయం

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి రూరల్, మే 17:

మన బడి నాడు- నేడు పథకంలోని రెండవ విడత పనుల్లో జాప్యం చేస్తున్నారనే నెపంతో 227 మంది హెచ్‌ఎంలకు డీఈవో వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేయడం అన్యాయమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం డీఈవో వెంకటలలక్ష్మమ్మను కొప్పాకలోని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో నిధులు జమ చేసి మే నెల రెండో వారంలో పనులు పూర్తి కాలేదనే నెపంతో ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. నిధులు జమ అయిన కాలం నుంచి నేటి వరకు ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక పనుల్లో నిమగ్నం చేసిందన్నారు. పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ వేల్యూయేషన్, సార్వత్రిక ఎన్నికల శిక్షణలు, ఎన్నికల విధులు తదితర పనుల్లో ఉపాధ్యాయులు నిమగ్నమై ఉన్నారని, అలాంటప్పుడు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ వేధింపులుగా కనిపిస్తోందన్నారు. డీఈవో వెంటనే జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి జోగా రాజేశ్, నాయకులు చిట్టయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అందాల తీరం.. అభివృద్ధి శూన్యం

ఆకట్టుకుంటున్న ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరం



ముత్యాలమ్మపాలెం తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు (ఫైల్ ఫొటో)

- గణనీయంగా పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య
- కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పరవాడ, మే 17:

మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సముద్ర తీరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పారిశ్రామికంగా ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందడంతో ప్రతి ఏటా ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే కనీస వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరంలో వసతులు కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు తరచూ చెబుతున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు.

ఈ ప్రాంతాలకు సెలవు రోజులతో పాటు కార్తీకమాసంలో జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు ఎక్కువగా వస్తుంటారు. తీరాల్లో సరదాగా గడుపుతుంటారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి ఇక్కడి జీడిమామిడి తోటల్లో వన భోజనాలు చేస్తారు. అయితే ఇక్కడ సరైన వసతి సదుపాయం లేకపోవడంతో పర్యాటకులు నానా అవస్థలు పడడంతో పాటు పలువురు మృత్యువాత పడుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మరింత మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా పాలకులు, అధికారులు దృష్టి పెట్టడం లేదు.

సింహాద్రి ఎన్టీపీసీ నిధులు మంజూరు చేసినా...

సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా తీరంలో వసతి కల్పించడానికి నిధులు మంజూరు చేసినా స్థల సమస్య కారణంగా పనులు ప్రారంభం కాలేదు. దీంతో అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ముత్యాలమ్మపాలెం తీరం లోతు తక్కువగా ఉండి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. దీనికి సమీపంలో చామలకొండ, దానిని అనుకుని ఉన్న సహజసిద్ధమైన ఉప్పుటేరు ఉండడంతో పర్యాటకులు వీటిని కాసేపు వీక్షించి సేదతీరడానికి వస్తుంటారు. అయితే ఎటువంటి విడిది గృహాలు, కనీసం కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడం, ఉప్పుటేరు ఉన్నా బోటు ... మిగతా 8వ పేజీలో



తిక్కవానిపాలెం తీరంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న ఎన్టీపీసీ జెట్టీ



ఉత్సవాన్ని పోలీసులు అడ్డుకోవడంతో వెనుదిరుగుతున్న భక్తులు

కొమరవోలు తల్లి జాతరకు బ్రేక్

ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి విశేష పూజలు

- సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించే సమయంలో పోలీసులు వచ్చి అభ్యంతరం
- తీవ్ర నిరాశకు గురైన భక్తజనం
- కనీసం ముందురోజు చెప్పినా జాతరను నిలిపివేసేవారమని కొమరవోలు గ్రామస్థుల ఆవేదన

రోలుగుంట, మే 17 : మండలంలోని కొమరవోలు గ్రామంలో జరిగిన కొమరవోలు తల్లి జాతర మహోత్సవాన్ని గురువారం రాత్రి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ వేడుక నిర్వహణకు సంబంధించిన అనుమతి కోసం ఉత్సవ కమిటీ ముందుగా పోలీసు శాఖకు చాలానా తీసింది. అనంతరం భారీ ఏర్పాట్లు చేపట్టింది. రూ.ఐదు లక్షలు వెచ్చించి పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసింది. గురువారం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా- రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా వచ్చారు. ఏడు గంటల ప్రాంతంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యే సమయంలో పోలీసులు వచ్చి అభ్యంతరం తెలిపారు. ఉత్సవాలను నిలిపివేయాలని కోరారు. దీంతో పలువురు ఉదయం నుంచి ప్రశాంతంగా వేడుక జరుగుతుందని, ఈ సమయంలో వచ్చి అడ్డుచెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అయినప్పటికీ పోలీసులు రాష్ట్రంలోని కొన్నిచోట్ల జరుగుతున్న సంఘటనల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరను నిలిపివేయాలని సూచించారు. దీంతో భక్తులంతా నిరాశకు గురయ్యారు.

సార్వత్రిక ఎన్నికల్లో గ్రామస్థులంతా ఏకమై టీడీపీకి మద్దతు

కొమరవోలు గ్రామం మొదటి నుంచి వైసీపీకి కంచుకోట. కాగా ఈ ఐదేళ్లలో వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడడం, ప్రభుత్వ విప్‌గా ఉన్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇక్కడి నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడంలో పూర్తిగా విఫలం కావడంతో ఆ పార్టీపై గ్రామస్థులలో వ్యతిరేకత ఏర్పడింది. దీంతో గ్రామం అంతా ఏకమై ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ... మిగతా 8వ పేజీలో

శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ..

పెచ్చులూడి పడుతున్న గొలుగొండ మండల పరిషత్ కార్యాలయ భవనం శ్లాబ్



కార్యాలయం గదిలో ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

- వర్షాలకు తడుస్తున్న ఫైళ్లు, కంప్యూటర్లుల
- ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు
- ఐదేళ్లుగా నిర్వహణను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

గొలుగొండ, మే 17 :

మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు పలుచోట్ల భయపెడుతున్నాయి. శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బితుకు బితుకుమంటూ ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్న వాదన వినిపిస్తోంది. మండల కేంద్రం గొలుగొండలోని మండల పరిషత్ కార్యాలయ భవనం దారుణంగా తయారైంది. ఈ భవనంలో నాలుగు గదులు ఉన్నాయి. శ్లాబ్ పరిస్థితి చూసి ఉద్యోగులు భయాందోళన చెందున్నారు. ఎప్పుడు ఎవరిపై పెచ్చులు ఊడిపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాలకు గదులు కారిపోతున్నాయి. దీంతో ఫైళ్లతో పాటు కంప్యూటర్లు తడిసిపోతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం కార్యాలయ భవనానికి నిధులు కేటాయించి మరమ్మతులు చేయించారు. ఆ తరువాత దీని నిర్వహణ పట్టించుకునేవారు కరువయ్యారు. మరుగుదొడ్ల మరమ్మతుకు మాత్రం రూ.రెండు లక్షల సాధారణ నిధుల నుంచి మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. భవనం మరమ్మతుల మాటేమిటని వివిధ పనులపై కార్యాలయానికి వచ్చేవారు ప్రశ్నిస్తే సమాధానం చెప్పే స్థితిలో సిబ్బంది లేరు. ఈ సమస్యను కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, నాలుగు మరుగుదొడ్ల మరమ్మతుకు రెండు రూ.లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. శ్లాబ్ పనులకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. శ్లాబ్ మరమ్మతులకు సంబంధించిన అంశాన్ని ఎంపీపీ వద్ద ప్రస్తావించినట్టు చెప్పారు.



వరండాలోని శ్లాబ్ పెచ్చులూడి పడుతున్న దృశ్యం

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ఎ.అగ్రహారం సమీపంలో దందా

- మంత్రి పేరు చెప్పి చెలరేగిపోతున్న అక్రమార్కులు
- ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ, గనుల శాఖ అధికారులు



ఎ.అగ్రహారం సమీపంలో ట్రాక్టర్‌కి గ్రావెల్ లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్



ట్రాక్టర్‌తో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

చీడికాడ, మే 17:

మండలంలోని ఎ.అగ్రహారం- బైలపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు వ్యాపారులు రేయింబవళ్లు దర్జాగా తవ్వి తరలించేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మంత్రి పేరు చెప్పి అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎ.అగ్రహారం సమీపంలో అప్పలరాజుపురం గ్రామానికి చెందిన ఓ ఎక్స్‌కవేటర్ యజమాని తన ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వి ఆరు ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీనిపై స్థానిక విలేకరులు ప్రశ్నించగా రాష్ట్ర మంత్రి అనుమతితో గ్రావెల్ తరలిస్తున్నామని సమాధానమిచ్చారు. బైలపూడి సచివాలయ వీఆర్వో చలుగు సత్యనారాయణకు స్థానిక విలేకరులు శుక్రవారం ఫిర్యాదు చేస్తే తాను అందుబాటులో లేనని సమాధానం ఇచ్చారు. దీనిపై తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌కి ఫోన్‌లో సంప్రతించగా తాము కలెక్టర్ కార్యాలయంలో సమావేశంలో ఉన్నామని తెలిపారు. దీంతో తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిస్తున్న ఫొటోలను ఆర్ఐ కృష్ణంరాజుకి విలేకరులు అందించారు. దీనిపై ఆర్ఐ కృష్ణంరాజుని ఆరా తీయగా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవని, వెంటనే ఎక్స్‌కవేటర్ యజమానిపైన, ట్రాక్టర్ యజమానులపైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల నంబర్లతో తహసీల్దార్‌కి నివేదిస్తానని ఆయన విలేకరులకు చెప్పారు. అయితే అక్రమ తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు ముందుగా అక్రమార్కులకు సమాచారం ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాము వెళ్లే సరికి ఎటువంటి తవ్వకాలు జరగడం లేదని అధికారులు చెబుతున్నారని అంటున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అధికారులకు ముడుపులు అందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్రైం... crime news

జీపు బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన నూకరాజు

మాడుగుల రూరల్, మే 17: మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓ జీపు బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని నక్కలపుట్టుకు చెందిన ఊడి నూకరాజు తన జీపును పాడేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి అద్దెకు తిప్పుతున్నాడు. అతని వద్ద సున్నం హరీశ్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం హరీశ్ జీపులో కార్యాలయం పని మీద విశాఖపట్నం వెళ్లి సాయంత్రం తిరిగి పాడేరు వస్తున్నాడు. చోడవరం దాటిన తరువాత వడ్డాది జంక్షన్‌లో ఉన్న ఆ జీపు యజమాని నూకరాజును జీపులో ఎక్కించుకుని బయలుదేరాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఎంకే వల్లాపురం దాటిన తరువాత ఘాట్‌రోడ్డు జంక్షన్ మధ్యలో గల చెరకు కాటా వద్దకు వచ్చేసరికి ఎదురుగా వాహనం రావడంతో దానిని తప్పించే క్రమంలో జీపు అదుపు తప్పింది. అది పంట కాలువ పక్కన ఖాళీ స్థలంలో బోల్తా పడడంతో స్థానికులు గుర్తించి జీపులోని ఇద్దర్నీ బయటకు తీశారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వారిని మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీపు యజమాని నూకరాజు తల, మెడ వెనుక భాగంలో గాయాలయ్యాయి. డ్రైవర్ హరీశ్‌కి నుదుటిపై స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించే ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్కాపురం, మే 17: షిప్‌యార్డు న్యూకాలనీ సమీపంలో గల ఏకేసీ కాలనీ జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో షిప్‌యార్డు సొసైటీ మాజీ ఉద్యోగి ఎండీ హుస్సేన్ (45) మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డారు. సింధియా నుంచి మల్కాపురం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా న్యూకాలనీ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆవు అడ్డంగా రావడంతో దానిని ఢీకొని రోడ్డుపై తుళ్లిపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా హుస్సేన్ మృతి చెందాడు. వెంకటరమణ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు హుస్సేన్ గాజువాక చెందిన వాడు కాగా, వెంకటరమణది మల్కా పురం. మల్కాపురం పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

వేసవి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం

భువనేశ్వర్ నుంచి దువ్వాడ మీదుగా ముంబైకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 17: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని దువ్వాడ మీదుగా నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు కొనసాగించనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (06507) ఈనెల 24 నుంచి జూన్ 14 వరకు, ఖరగ్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06508) ఈనెల 27 నుంచి జూన్ 17 వరకు, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను (06585) ఈనెల 31 నుంచి జూన్ 14 వరకు, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06586) జూన్ ఒకటి నుంచి జూన్ 15 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్‌ను (06569) ఈనెల 26 నుంచి జూన్ తొమ్మిది వరకు, గుహవటి--ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06570) ఈనెల 29 నుంచి జూన్ 12 వరకూ పొడిగించామని పేర్కొన్నారు. కాగా ఎస్ఎంవీ బెంగళూరు-మల్దా టౌన్ ఎక్స్‌ప్రెస్ (06563) జూన్ 6న (ఆదివారం), మల్దా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (06564) జూన్ 12న (బుధవారం), మైసూరు-ముజాఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (06221) జూన్ 10న (సోమవారం), ముజాఫర్‌పూర్-మైసూరు ఎక్స్‌ప్రెస్ (06222) జూన్ 13న (గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబైలకు ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబై స్టేషన్లకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని, అయితే ఈ రైళ్లు ఒకవైపు మాత్రమే నడవనున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 01452 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) ఉదయం 4.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి 11.43 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 7.00 గంటలకు షోలాపూర్ చేరుతుంది. 01056 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) రాత్రి 11.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.45 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ముంబై వెళుతుంది.

దివ్యాంగ యువతకు ఐటీఐలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మే 17: బక్కన్నపాలెంలోని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శిక్షణ సంస్థ 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి దివ్యాంగ యువతకు ఐటీఐలో శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈమేరకు ప్రాజెక్టు ఆఫీసర్ పీవీ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పెంటర్ 24, షీట్ మెటల్ వర్కర్ 20, వెల్డర్ 20, పెయింటర్ 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పదో తరగతి పాసైన వారు అర్హులని, ఏడాది పాటు శిక్షణ ఉంటుంద న్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 10న జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు ఈ కేంద్రం నుంచే శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎంపికైన వారికి ఉచిత ఫీజు, భోజనం, వసతి కల్పించడంతో పాటు జాబ్‌మేళా నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఒలుపు చందనం విక్రయాలకు బ్రేక్


బారులుదీరిన భక్తులు

సింహాచలం, మే 17: వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను శనివారం నిలుపుదల చేస్తున్నట్టు దేవాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 20, 21 తేదీల నుంచి మళ్లీ విక్ర యాలు కొనసాగుతాయని చెప్పారు. ఈనెల 16 నుంచి ప్రారంభమైన ఒలుపు చందనం విక్రయాలు శుక్రవారం కూడా కొనసాగాయి. రెండవ రోజు చందనం ప్రసాదాల కొనుగోలుకు ఉత్తరాంధ్ర నలుమూలలు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయం నుండే క్యూలో బారులు తీరారు. ఒకదశలో క్యూ ప్రసాదాల విక్రయాల కేంద్రం నుంచి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న నిత్యాన్న ప్రసాద భవనం వరకు కనిపించింది. దేవాలయ ఏఈఓ ఎన్. ఆనందకుమార్ విక్రయాల కౌంటర్ వద్ద స్వయంగా ఉండి పర్యవేక్షిస్తూ వెయ్యి పేకెట్ల వరకూ విక్రయించారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మే 17: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూర విద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ధర్మారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో వెబ్‌సైట్‌లోని అడ్మిషన్ లింకు ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. అన్ని కోర్సుల్లోనూ ప్రవేశాలకు దరఖాస్తు గడువు జూన్ 30 అని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 0891 2511200ను సంప్రతించాలని సూచించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తేడా కొట్టింది...

నర్సీపట్నం నియోజకవర్గంలోని ఎనిమిదిపోలింగ్ కేంద్రాల్లో ఓట్లలో హెచ్చు తగ్గులు

- ఎమ్మెల్యే అభ్యర్థి పడి.. ఎంపీకి పడని ఓట్లు 7
- ఎంపీ అభ్యర్థికి పడి.. ఎమ్మెల్యేకి పడని ఓట్లు 5
- ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తక్కువ పోలింగ్


నర్సీపట్నంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, మే 17 : సార్వత్రిక ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తక్కువ పోలయ్యాయి. ఈ నియోజకవర్గంలో నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో మొత్తం 2,12,046 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎమ్మెల్యే అభ్యర్థికి 1,79,852 ఓట్లు, ఎంపీ అభ్యర్థికి 1,79,850 ఓట్లు పడ్డాయి. ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి రెండు ఓట్లు తక్కువ పోలయ్యాయి. నియోజవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలలో ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌లో ఓట్ల హెచ్చు తగ్గులు కనిపించాయి. ఇందుకు ఉదాహరణ.. నాతవరం 85వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 503, ఎంపీ అభ్యర్థికి 504 ఓట్లు పోలింగ్ జరిగింది. ఈ కేంద్రంలో ఎమ్మెల్యే కంటే ఎంపీకి ఒక ఓటు ఎక్కువ పడింది. నాతవరం మండలం శృంగవరంలోని 102వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 734 ఓట్లు, ఎంపీకి 732 ఓట్లు పడ్డాయి. ఈ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కంటే ఎంపీకి రెండు ఓట్లు తక్కువ పడ్డాయి. ఇక్కడే ఉన్న 103వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 641, ఎంపీకి 642 ఓట్లు వేశారు. ఇక్కడ ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి ఒక ఓటు ఎక్కువ పోలైంది. అలాగే, నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధి బలిఘట్టంలోని 150 పోలింగ్ కేంద్రంలో ఎమ్మెలే అభ్యర్థికి 905 ఓట్లు, ఎంపీ అభ్యరికి 903 ఓట్లు పోలయ్యాయి. ఈ కేంద్రంలో ఎమ్మెల్యేకి రెండు ఓట్లు ఎక్కువ పోలయ్యాయి. నర్సీపట్నం మండలం కేఎల్‌పురంలోని 191వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి 643 ఓట్లు, ఎంపీకి 642 ఓట్లు పడ్డాయి. పెదబొడ్డేపల్లి 198వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేకి 918 ఓట్లు, ఎంపీకి 919 ఓట్లు పడ్డాయి. జోగినాథునిపాలెంలోని 202వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేకి 885, ఎంపీకి 887 ఓట్లు పడ్డాయి. నర్సీపట్నంలోని 164వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యేకి 602 ఓట్లు, ఎంపీకి 600 ఓట్లు పడ్డాయి. పోలింగ్ కేంద్రాలు 85, 102, 103, 150, 191, 198, 202, 164 పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థికి పడి ఎంపీ అభ్యర్థికి పడని ఓట్లు 7 ఉంటే, ఎంపీకి పడి ఎమ్మెల్యే అభ్యర్థికి పడని ఓట్లు 5 ఉన్నాయి. నియోకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు చూసుకుంటే ఎమ్మెల్యే కంటే ఎంపీకి రెండు ఓట్లు తక్కువ పడ్డాయి.

21న సతకంపట్టుకు మోదకొండమ్మ

- వచ్చే నెల 18న మాడుగులలో అమ్మవారి జాతర
- భారీ ఏర్పాట్లు చేపట్టనున్నట్టు కమిటీ సభ్యులు వెల్లడి


మాడుగుల మోదకొండమ్మ

మాడుగుల, మే 17: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 18వ తేదీన జరగనుంది. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీ ఆదివారం జాతర చాటింపు, 21వ తేదీ మంగళవారం సతకంపట్టు వద్ద అమ్మవారు కొలువుదీరనున్నారని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలుత జూన్ మొదటి వారంలో జాతర నిర్వహించాలని భావించామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కమిటీ సభ్యులమంతా చర్చించి ఈ మేరకు వాయిదా వేసినట్టు చెప్పారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల సహకారం తీసుకోనున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే, జాతర సందర్భంగా అమ్మవారి మాలధారణ చేసే భక్తులకు ఉచితంగా దండలు ఇవ్వడం జరుగుతుందని సభ్యులు తెలిపారు. ఇవే దండలు బయట మార్కెట్‌లో రూ.350కి విక్రయిస్తున్నట్టు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధ శ్రీనివాసరావు, కొట్యాడ మల్లిఖార్జునరావు, కుప్పిలి భవానీ శంకర్, దర్శిశెట్టి అప్పారావు, ద్రాక్షారపు అచ్యుతరావు, దాడి అవినాష్, బెజవాడ రాజేశ్వరరావు, పల్లెల రాములు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో దారుణం

- ప్రైవేటు లే-అవుట్ ధ్వంసం చేసి గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- లబోదిబోమంటున్న ప్లాట్ల యజమానులు


గొల్లలపాలెం శివారు జగన్నాథపురంలో ప్రైవేటు లే-అవుట్‌లో తవ్వుకుపోయిన గ్రావెల్

సబ్బవరం, మే 17: మండలంలోని గొల్లలపాలెం శివారు జగన్నాథపురం గ్రామంలో గ్రావెల్ అక్రమార్కులు రెచ్చిపోయారు. ఓ ప్రైవేటు లే-అవుట్‌లో కొన్ని రోజులుగా దర్జాగా రాత్రి వేళల్లో గ్రావెల్/మట్టిని యంత్రాల సాయంతో తవ్వి ట్రాక్టర్లు, డంపర్లతో తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 273 పూరాలో 53.90 ఎకరాల భూమి ఉంది. అందులో 273/2లో 14.90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సదరు భూమిని కొందరు 40 ఏళ్ల క్రితం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. 1983లో ప్రభుత్వ భూమిని కలుపుకొని 53.90 ఎకరాల్లో పంచాయతీ లే-అవుట్ వేశారు. సుమారు 600 ప్లాట్లు 266 గజాలు చొప్పున వేసి అప్పట్లోనే అమ్మేశారు. అయితే ఇటీవల 273/2లో 14.90 ఎకరాలు ప్రభుత్వ భూమి అని వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే మిగిలిన 39 ఎకరాల్లో పక్కా లే-అవుట్‌లో ప్లాట్లు ఉన్నాయి. ఈ లే-అవుట్ పైడివాడ అగ్రహారం జగనన్న కాలనీకి ఆనుకొని ఉండడం, జనావాసాలకు దూరంగా ఉండడంతో కొంత మంది అక్రమార్కులు కళ్లు ఈ లే-అవుట్‌పై పడ్డాయి. సబ్బవరంతో పాటు గాజువాక, లంకెలపాలెం ప్రాంతాల్లో ఇళ్ల బేస్మెంట్లు, లే-అవుట్ల ఫార్మేషన్‌కు గ్రావెల్/మట్టికి డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోయి వందలాది లారీలతో తరలించుకుపోయారు. ప్లాట్ల యజమానులు ఆలస్యంగా తెలుసుకొని లబోదిబోమంటున్నారు. సుమారు 5 నుంచి, 6 అడుగులు లోతులో గ్రావెల్/ మట్టి తవ్వేయడంతో లే-అవుట్‌లో ప్లాట్లు ఆనవాళ్లు లేకుండా పోయాయని వాపోతున్నారు. చాలా మంది ప్లాట్లు తనఖా పెట్టి బ్యాంక్‌లో రుణాలు కూడా తీసుకున్నట్టు చెబుతున్నారు. మైనింగ్, పోలీస్ అధికారులు దృష్టిసారించి గ్రావెల్/మట్టి తవ్వకాలు జరిపిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం మారితే.. మా పరిస్థితి ఏమిటీ?

- కొత్త ప్రభుత్వంలో అవకాశం ఉంటుందా..!
- గ్రామ, వార్డు వలంటీర్ల అంతర్మథనం

కోటవురట్ల, మే 17: వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తామే వ్యవహరించిన వలంటీర్లు కొత్త ప్రభుత్వంలో తమ పరిస్థితి ఏమిటని మదనపడుతున్నారు. ఎన్నికల సమయంలో వేలాది మంది వలంటీర్లు విధుల నుంచి తప్పుకున్నారు. అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి ఎన్నికల్లో ధైర్యంగా వైసీపీకి మద్దతుగా పనిచేశారు. మరికొందరు రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారిందని వలంటీర్లు అంటున్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండడంతో ఎంతోమంది యువత వలంటీర్లుగా చేరారు. నెలకు రూ.5 వేలు పారితోషికంతో వారు పనిచేశారు. ఒక్కో వలంటీరు పరిధిలో 50ఇళ్లను కేటాయించి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడం, రేషన్ పంపిణీ వంటి విధులను నిర్వహించారు. ప్రజలతో మమేకమైన వలంటీర్లను ఎన్నికల్లో ఉపయోగించుకోవడానికి సేవామిత్ర, సేవారత్న, సేవావజ్రం వంటి పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాల ఫిర్యాదులతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచింది. అయితే వలంటీర్ల సేవలను ఎలాగైనా ఉపయోగించుకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న వైసీపీ నాయకులు వారిపై ఒత్తిడి చేసి రాజీనామాలు చేయించారు. కొందరు వలంటీర్లు అయితే అయిష్టత వ్యక్తం చేసినా వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లకు తాము వ్యతిరేకంగా కాదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి పారితోషకం రూ.5నుంచి రూ.10వేలు పెంచి పనులు చేయిస్తామని ఎన్నికల ప్రచారాల్లో హామీ ఇచ్చారు. దీంతో వలంటీర్లుగా పనిచేసి విధుల నుంచి తప్పుకున్న వారు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమను తిరిగి విధుల్లోకి తీసుకుంటారనే ఆశ... నిరాశల మధ్య కొట్టుమిట్టులాడుతున్నారు. రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధుల్లో తీసుకుంటారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఓటింగ్‌పై ఆసక్తి చూపని ఎల్‌టీ.కాలనీ ఓటరు

- ప్రస్తుత ఎన్నికల్లో 55.01 శాతం
- 2019లో 57.3 శాతం ఓటింగ్
- 80వ బూత్‌లో అతితక్కువగా 47.98 శాతం పోలింగ్


పాయకరావుపేటలో లింగాలతోట కాలనీ

పాయకరావుపేట, మే 17: సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేటలోని ఎల్‌టీ.కాలనీ (లింగాలతోట కాలనీ) వాసులు ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈసారి జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పోటెత్తి 75 నుంచి 80 శాతంపైగా ఓటింగ్ జరిగినా ఎల్‌టీ.కాలనీలో 55 శాతం మాత్రమే పోలింగ్ అయ్యింది. ఇక్కడ ఉన్న 80, 81, 82 పోలింగ్ కేంద్రాల్లో 2,523 మంది ఓటర్లుండగా.. 1,388 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80వ పోలింగ్ కేంద్రంలో నియోజకవర్గంలోనే అత్యంత తక్కువగా 47.89 శాతం ఓటింగ్ నమోదయ్యింది. 81లో 796 మందికి 490 (61.56శాతం), 82లో 883 మందికి 541(61.27శాతం) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎల్‌టీ.కాలనీలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,446 మంది ఓటర్లుండగా 1,395(57.3 శాతం) మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉద్యోగులు, వ్యాపారస్తులు అధికంగా ఉండే ఈ కాలనీలో స్థానికేతరులు ఉండడంతో పాటు పలువురు ఎన్నికల్లో ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవడం వలనే ప్రతిసారి ఓటింగ్ శాతం తగ్గుతోందన్న వాదన వినిపిస్తోంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎంత మొర పెట్టుకుంటున్నా కాలనీలో నివాసముంటున్న వారు ఓటు వేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో ప్రతిసారి జరిగే ఎన్నికల్లో ఇక్కడ ఓటింగ్ శాతం తగ్గుతుండడం కారణమవుతోంది.

టీడీపీకి వేటు వేశారన్న నెపంతో దాడిపై డీసీపీ, ఏసీపీ ఆరా

కంచరపాలెం, మే 17: టీడీపీకి ఓటు వేయలేదనే నెపంతో బర్మాక్యాంప్‌లో లోకేష్ అనే వ్యక్తి జరిపిన దాడిలో గాయపడిన బాధితుల ఇళ్లను పశ్చిమ డీసీపీ మేక సత్తిబాబు, ఏసీపీ అన్నెం నరిసింహామూర్తి శుక్రవారం సందర్శించారు. బాధితులతో వారు మాట్లాడారు. ఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సుంకర నూకరత్నం, ఆమె తల్లి ధనలక్ష్మి, మణికంఠపై లోకేష్ దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై రాజకీయ ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో డీసీపీ, ఏసీపీలు వచ్చి విచారించారు. ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు మద్యం సేవించి బుధవారం లోకేష్ ఇంటి వద్ద న్యూసెన్స్ చేశారని, ఈ నేపథ్యంలోనే లోకేష్ వారిపై దాడి చేసినట్టు స్థానికులను విచారించగా తెలిసిందని డీసీపీ పేర్కొన్నారు. వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు పులిమితే చర్యలు తీసుకుంటామని డీసీపీ సత్తిబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి ఉన్నారు.

రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్



రక్తపోటు నివారిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 17: రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో మెలగాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.హేమంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మే 17 ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో సమాజంలో రక్తపోటు బాధితుల సంఖ్య పెరుగుతుందన్నారు. మారుతున్న జీవనశైలి, శారీరిక శ్రమ లోపించడం, ఫాస్ట్ ఫుడ్స్ కారణంగా చిన్నవయసులోనే రక్తపోటుకు గురవుతున్నారన్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తపోటు (బీపీ) పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలన్నారు. నడక, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రక్తపోటును నియంత్రించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ వైద్య విధాన సమన్వయకర్త డాక్టర్ వీరజ్యోతి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం


పోటీలను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


'నాలోన నీవే' నాటికలో సన్నివేశం

అనకాపల్లి టౌన్, మే 17: స్థానిక వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలను శుక్రవారం రాత్రి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు కారణంగా ఈ పోటీలు ఆలస్యమయ్యాయన్నారు. నాటకాలు, నాటికలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిన ఈ రోజుల్లో పీసీహెచ్ నాయుడు మూడేళ్లుగా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీహెచ్ నాయుడు, కేఎం నాయుడు, 1974-75 ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దలు నిలబెట్టిన కాపురమే 'నాలోన నీవే' నాటిక

తండ్రి చనిపోయిన శ్రీరామ్‌కు తల్లంటే ప్రేమ, గౌరవం, సర్వస్వం. ప్రేమించి పెళ్లి చేసుకున్న జానకి అంటే కూడా శ్రీరామ్‌కు అంతులేని ప్రేమ, గౌరవం. తన తల్లి, భార్య అన్యోన్యంగా ఉండాలని శ్రీరామ్ తన తల్లితో, మావయ్య ధర్మాత్మతో చెప్పి ఒప్పించి నాటకం ఆడతాడు. అది తెలియని జానకి ఇంట్లో జరుగుతున్న పరిణామాలకు నిద్ర పట్టక భయంతో, ఆందోళనతో డిప్రెషన్ చెందుతుంది. ఆ షైకంలో తండ్రి ధర్మాత్మకు ఫోన్ చేసి నాకు విడాకులు కావాలని కోరుతుంది. కనిపించని ఆ శ్రీరామచంద్రుడు కంటే నన్ను కట్టుకున్న నా భర్త నా శ్రీరామ్ గొప్పని చెప్పావుగా తల్లీ.. అని జానకిని ధర్మాత్మ నిలదీస్తాడు. అవును నా విషయంలో నా శ్రీరామ్ శ్రీరాముడే అయిన నాకు విడాకులు కావాలని కోరుతుంది. శ్రీరామ్ తల్లి పార్వతమ్మ,మావయ్య ధర్మాత్మం కలిసి ఆడిన నాటకమే ఈ నాటిక సస్పెన్స్. గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు.

కుటుంబ సంబంధాలను చాటి చెప్పే 'అమృతహస్తం'

ఒక తల్లి కడుపున పుట్టిక పోయినా అన్నా చెళ్లెళ్ల అనుబంధం చాలా గొప్పది. ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న ఇలాంటి బంధాలు ఎంత అవసరమో సమాజానికి గుర్తు చేయడం ఈ కథాంశం. ప్రేమించి పెళ్లి చేసుకున్న చెల్లెల్ని అష్టకష్టాలు పెడుతున్న భర్తని భరించి వారి కాపురం సజావుగా సాగడానికి అన్న ఎన్నో విధాలుగా ఆదుకుంటూ ఉంటాడు. చెల్లి రోగంతో బాధపడుతుంది. చెల్లెని, బావని ఇంట్లో పెట్టుకుంటాడు అన్న. అయితే భర్త చేసిన పనిని అన్న భార్య తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈలోగా ఆ ఇంట్లో తిష్టవేసిన చెల్లి భర్త ఒక్కోసారి ఒక్కో విధంగా డబ్బులు గుంజుతూ చివరకు అన్న ఉన్న ఇంటిలో సగభాగాన్ని రాయించమని భార్యను వేధిస్తాడు. ఆధునిక టెక్నాలజీతో అతని మాటలు, చేష్టలు, బెదిరింపులు, హత్యా ప్రయత్నాన్ని అన్నింటిని రికార్డు చేసి చట్టం దృష్టిలో అతనికెంతో శిక్ష పడుతుందో అన్నా చెల్లెలు చెప్పగా హరి తలొంచుకుని వెళ్లిపోతాడు. గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు.

మోతుగూడెంలో పుష్ప-2 షూటింగ్


సీలేరు నదిలో ఎర్రచదనం దుంగలు డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

మోతుగూడెం, మే 17: చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపాడు, పాలగడ్డ, డొంకరాయి, పొల్లూరు పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా చిత్రీకరించిన పుష్ప-2 సినిమా షూటింగ్ గురువారం ముగిసింది. సీలేరు నదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

విశాఖపట్నం, మే 17: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు జి.సాంబయ్య (55) ఫిట్ (వేడి నీరు ఉండే ప్రాంతం)లో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలావున్నాయి....పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన సాంబయ్య శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా విభాగంలో 30 అడుగుల కిందకు దిగి ఫిట్‌లో నీటి (60డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన నీరు)ని పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో ఫిట్‌లో నీరు ఆరడుగులుంది. ప్రమాదవశాత్తు అందులో పడిపోవడంతో శరీరం కాలిపోయింది. విధుల్లోని ఉద్యోగులు హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటన స్థలానికి పరిశీలించారు.

గంటాతో అనిత భేటీ



అనితను సత్కరిస్తున్న గంటా శ్రీనివాసరావు

నక్కపల్లి, మే 17: ఎన్నికల ప్రక్రియ ముగియడంతో బరిలో నిలిచిన ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు ఎంతో ఉత్సాహంగా కనబడుతున్నారు. ఎన్నికలకు ముందు పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీలో కొందరి నేతల మధ్య వున్న విభేదాలను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పరిష్కరించారు. పోలింగ్ అనంతరం శుక్రవారం విశాఖలో వున్న గంటా నివాసానికి టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత వెళ్లారు. ఆమెకు గంటా సాదరస్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. అనిత కూడా గంటాను సత్కరించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట, జిల్లా రాజకీయాల గురించి వీరిద్దరూ చర్చించుకున్నారు. భీమిలిలో గంటా, పాయకరావుపేటలో అనిత గెలుపు గ్యారంటీ అంటూ ఒకరికొకరు అడ్వాన్స్‌గా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు వారం రోజుల ముందు నుంచి ఎన్‌డీఏ వేవ్ స్పష్టంగా కనిపించిందని, అనూహ్య మెజార్టీ స్థానాలతో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తుందని గంటా అభిప్రాయపడ్డారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల సేవ



ఊంజల సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 17 : స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజలసేవ భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి వేదమంత్రాల మధ్య వేగి నాగేశ్వరరావు, అనురాధ దంపతులు, కుటుంబ సభ్యులు ఊంజల సేవను కన్నుల పండువగా నిర్వహించారు. పలు మహిళా మండలి సభ్యులు ఆలపించిన భక్తిగేయాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలన



ఈవీఎంలను స్కూల్ వద్ద దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్, మే 17: జిల్లా కలెక్టర్ ఆఫీసు ప్రాంగణం వద్ద ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ ఈవీఎంలకు ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత, ఈవీఎంలు దాచి పెట్టిన విధానం, స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీల్స్‌ను వీడియో ద్వారా పరిశీలించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు సీసీ లైవ్ కెమెరాల ఫుటేజీలను బయట తనిఖీ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కోరామని చెప్పారు. ఇందుకు కలెక్టర్ అంగీకరించారని, ఈవీఎంల భద్రతకు ఏర్పాటు చేసిన కెమెరాల లైవ్ ఫుటేజిని అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు పరిశీలించేందుకు ఈరోజు మధ్యాహ్నం నుంచి ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ చెప్పినట్టు రత్నాకర్ చెప్పారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కి చీఫ్ ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న దాడి రత్నాకర్ ఇక్కడ పోలీస్ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ,మే 17: పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, రావాడ, పరవాడ, భరిణికం, తానాం, ఈ.బోనంగి, పి.బోనంగి, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, కలపాక, వెన్నెలపాలెం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డైట్‌లో 'లై ఫై' టెక్నాలజీ ఆవిష్కరణ

- విద్యార్థినులను అభినందించిన రత్నాకర్




పరికరం తయారు చేసిన విద్యార్థినులు (ఇన్‌సెట్‌లో) లై ఫై టెక్నాలజీ పరికరం

అనకాపల్లి టౌన్, మే 17 : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో టెలి కమ్యూనికేషన్స్ డే సందర్భంగా శుక్రవారం నూతన టెక్నాలజీ (లై ఫై)పై ప్రాజెక్టు తయారు చేశారు. డైట్ కళాశాల విద్యార్థినులు లై ఫై టెక్నాలజీ ద్వారా మనం ఇచ్చిన సిగ్నల్ లైట్ ద్వారా ట్రాన్స్‌ఫర్ అయి దానికి అమర్చిన సెన్సార్ ద్వారా సిగ్నల్ రిసీవ్ చేసుకుంటుందని విద్యార్థినులు తెలిపారు. ఈ పరికరం సహాయంతో వాహనాలు వేగాన్ని అంచనా వేసి డిస్ప్లే చేస్తుంది. అలాగే ఉష్ణోగ్రతను కూడా రిసీవ్ చేసుకుని డిస్ప్లే చేస్తుందని విద్యార్థినులు చల్లా లక్ష్మి ఐశ్వర్య, పి.ఉమ సుప్రజ తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి కావలసిన పరికరాలు ఆర్డినో బోర్డ్, ఎల్‌సీడీ డిస్ప్లే, లైట్, సెన్సార్, మైక్రోఫోన్, స్పీకర్ వాడినట్టు వారు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి రెండు వేల రూపాయలు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నకర్ మాట్లాడుతూ ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని, కమ్యూనికేషన్ డే రోజున ఈ ఆవిష్కరణ చాలా బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, డీన్ అకాడమిక్ డాక్టర్ కె. పార్వతి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణప్రియ, షేక్ షబీన, ఎన్. విద్య కె. పద్మ, శేషగిరిరావు విద్యార్థులను ప్రశంసించారు.

పోల్ మేనేజ్‌మెంట్‌లో ఫెయిల్ ?

- కొంపముంచిన కేడర్
- అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదని నిర్లిప్తత
- వైసీపీలో అంతర్మథనం



నక్కపల్లి, మే 17: "పార్టీని భుజస్కంధాలపై మోసిన మమ్మల్ని ఐదేళ్లపాటు ప్రభుత్వం బకరా చేసింది.. వలంటీర్లకే పెత్తనం ఇచ్చింది.. పైసా ఆదాయం లేదు. కనీసం సర్పంచులకు కూడా పంచాయతీలపై పెత్తనం లేకుండా చేసింది.. అందుకే ఈసారి తాము నిర్లిప్తంగా ఉన్నామంటూ" వైసీపీ కేడర్ అంటోంది. ఓటింగ్‌కు రెండు రోజుల ముందు పోల్ మేనేజ్‌మెంట్‌లో కేడర్ విఫలమైందన్న నిజాన్ని పోలింగ్ ముగిశాక వైసీపీ పెద్దలు గుర్తించారు. ఈ కారణంగానే ఉమ్మడి విశాఖ జిల్లాలో టఫ్‌గా వున్న కొన్ని నియోజకవర్గాల్లో ఎన్‌డీఏ కూటమికి ఎదురు లేకుండా పోయిందని వైసీపీ అధిష్ఠానం ఆలస్యంగా గుర్తించినట్టు సమాచారం. పోలింగ్ ముగిసిన తరువాత బూత్ లెవల్ నుంచి నియోజకవర్గ స్థాయి వైసీపీలో ఈ లుకలుకలు వినబడుతున్నాయి.

2019 ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా గొల్ల బాబూరావు 31,189 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అప్పుడు ప్రతిపక్షంగా వైసీపీ బరిలో నిలిచింది. ఎటువంటి పథకాలు, ప్రజలకు లబ్ధి లేకపోయినా ఆ మెజారిటీ వచ్చిందని, ఈసారి ఎన్నో పథకాల ద్వారా ప్రతీ ఇంటికి మేలు జరిగిందని, అందువల్ల 2019లో వచ్చిన మెజారిటీ రాకపోయినా అందులో సగమైనా వస్తుందని భావించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని, రాజాం ఎమ్మెల్యే జోగులను ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. మరోవైపు కూటమి అభ్యర్థినిగా వంగలపూడి అనిత బరిలో నిలిచారు. ఎన్నికల తేదీ దగ్గర పడిన కొద్దీ వైసీపీ సహా,రాజకీయ విశ్లేషకులు పాయకరావుపేట నియోజకవర్గంలో టఫ్ ఫైట్ అని భావించారు. కానీ పోలింగ్‌కు 24 గంటల ముందు నియోజకవర్గంలో సీన్ రివర్స్ అయిపోయిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఇలా జిల్లాలో టైట్‌గా అనుకున్న కొన్ని నియోజకవర్గాల్లో పోల్ మేనేజ్‌మెంట్‌లో తమ కేడర్ ఫెయిలైందని ఆ పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.

నోట్ల కట్టలో నోట్లు మాయం ?

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వైసీపీ ముందుగానే అస్త్ర,శస్త్రాలను సిద్ధం చేసింది. వాస్తవానికి పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో ఓటర్లకు 80 శాతం మేర తాయిలాలు అందించాలని నిర్ణయించి, ఓటర్ల సంఖ్యను బట్టి అన్ని గ్రామాలకు నగదు సిద్ధం చేశారు. అనేక మండలాలు, గ్రామాలకు డబ్బులు పంపిణీ చేసేటప్పుడు నోట్ల కట్టల్లో కొన్ని నోట్లు మాయమయ్యాయని ఆలస్యంగా కేడర్ గుర్తించింది. మనకు తగ్గించి ఇచ్చినప్పుడు మనమూ కాస్త హస్తలాఘవం ప్రదర్శిస్తే చూసొచ్చేదెవరని ఆ పార్టీలోని మరికొందరు నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. దీంతో ఎన్‌డీఏ కూటమితో పోల్చుకుంటే పోల్ మేనేజ్‌మెంట్‌లో తాము విఫలమయ్యామని ఆ పార్టీలో సీనియర్లు చర్చించుకుంటున్నారు. కూటమి తరహాలో పోలింగ్ ముందు రోజు డోర్ టూ డోర్ తాము ఓటర్లను కలవలేకపోయామని చెబుతున్నారు. ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోతో పాటు పోల్ మేనేజ్‌మెంట్‌లో కూటమి నాయకులు ఎంతో అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేశారని వారంటున్నారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో ఫెయిలైన ప్రాంతాల్లో ఏ నాయకుడు జెల్ల కొట్టాడనే దానిపై వైసీపీ అప్పుడే ఒక జాబితాను సిద్ధం చేసినట్టు భోగట్టా. బయటకు మాత్రం తమదే గెలుపు అంటూ వైసీపీ అభ్యర్థులు మేకపోత గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. అంతర్గతంగా కొన్ని చేజారిపోయాయని చర్చించుకుంటున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ఎన్‌డీఏ వేవ్ కూడా ప్రభావితం చేసిందని చెబుతున్నారు.

పల్లెల్లో ఉత్సాహం.. పట్టణాల్లో నైరాశ్యం

- ఎలమంచిలి నియోజకవర్గంలో పోలింగ్ తీరు
- అత్యధికంగా మునగపాక మండలం గొల్లలపాలెంలో 95.99%
- అత్యల్పం ఎలమంచిలి పట్టణంలోని 38వ పోలింగ్ బూత్‌లో 59.57%

ఎలమంచిలి, మే 17: ఎలమంచిలి నియోజకవర్గంలో గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ అధికంగా నమోదైంది. ఓటు వేసేందుకు ఓటర్లు సమయానికి కంటే ముందుగానే పోలింగ్ కేంద్రానికి వచ్చి వినియోగించుకోవడం, రాత్రయినా సరే గంటల తరబడి వేచి ఉండడం ఈ సార్వత్రిక ఎన్నికల్లో విశేషం. ఎలమంచిలి నియోజకవర్గంలో ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే.. అత్యధిక పోలింగ్ మునగపాక మండలం గొల్లలపాలెం 162 పోలింగ్ కేంద్రంలో 574 మంది ఓటర్లకు గాను, 551 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 95.99 శాతం నమోదైంది. రెండవ అత్యధిక స్థానంలో రాంబిల్లి మండలంలోని రజాల అగ్రహారం శివారు వై.లోవ 84వ పోలింగ్ కేంద్రంలో 845 మంది ఓటర్లకు గాను, 811 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా 95.98 శాతం నమోదైంది. మూడో స్థానంలో ఎలమంచిలి మండలం జంపపాలెం 60వ పోలింగ్ కేంద్రంలో 981 మంది ఓటర్లకు గాను, 933 మంది ఓటర్లు ఓటు వేయడంతో 95.11 శాతం నమోదైంది. అత్యల్పంగా ఎలమంచిలి పట్టణంలోని బ్రిడ్జి స్కూలు 38వ పోలింగ్ కేంద్రంలో 752 మంది ఓటర్లకు గాను, 448 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఎలమంచిలి యర్రవరం పోలింగ్ కేంద్రం వద్ద రాత్రి 9 గంటలు దాటినా ఓటు వేసేందుకు ఉన్న ఓటర్లు

దీంతో ఈ కేంద్రంలో అత్యల్పంగా 59.57 పోలింగ్ శాతం నమోదైంది. తరువాత రెండు అత్యల్ప స్థానాలు ఎలమంచిలి పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో నమోదు కావడం విశేషం. ఈసారి జరిగిన ఎన్నికల్లో పట్టణ ఓటర్లు కంటే గ్రామీణ ప్రాంతాల ఓటర్లు అధిక సంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య లోపం

- వాడనర్సాపురం, కొత్తపట్నంల్లో అధ్వానంగా సీసీ రోడ్లు

రాంబిల్లి, మే 17 : మండలంలోని మత్స్యకార గ్రామాలైన వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు కంపుకొడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులుగాని, మండల స్థాయి అధికారులు గానీ సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. వాడనర్సాపురంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువలో మురుగునీరు పారడం లేదు. అంతేకాదు కాలువ



వాడనర్సాపురంలో ఇళ్లలోని వాడుక నీరు సీసీరోడ్డుపై నిలిచిన దృశ్యం.



కొత్తపట్నం సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మొత్తం చెత్తతో నిండిపోయింది. గ్రామంలోని వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో వాడుకనీరు రోడ్లపై నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో సైతం సీసీ రోడ్లు ఆరడం లేదని, తమ ఇళ్లకు వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. దీనివల్ల దోమలు పెరిగి నిద్రకు దూరమవుతున్నామని వాపోయారు. వర్షం కురిస్తే సీసీ రోడ్లు కాలువలను తలపిస్తున్నాయని వారంటున్నారు. కొత్తపట్నంలో కూడా పలుచోట్ల రోడ్డును ఆనుకొని చెత్త నిల్వలు పేరుకుపోయాయి. సచివాలయం వెనుక భాగాన ఉన్న చెరువులో కూడా చెత్త పేరుకుపోయి ఉండడంతో దుర్వాసన వస్తున్నదని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. పలుమార్లు గ్రామాలకు వచ్చిన అధికారులకు, నియోజకవర్గ పాలకులకు విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఇప్పటికైన అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి గ్రామాల్లో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

'మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి'

తుమ్మపాల, మే 17: ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్ పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా తుమ్మపాల, మార్టూరు, పాపయ్యపాలెం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ మేరకు గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వ్యాయామం చేస్తూ బీపీని నియంత్రించేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది డి.శారదా, బి. మంగమ్మ, బి.సంగం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని దిమిలిలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. రక్తపోటు ఉన్న రోగులు క్రమం తప్పకుండా వైద్యాధికారి సూచనలు మేరకు మందులు వాడాలని సూచించారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకొనేందుకు కృషిచేస్తామని స్థానిక ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి బాలశ్రావణి,ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు, స్టాఫ్ నర్స్ ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ అప్పలరాజు పాల్గొన్నారు.

కశింకోటలో.. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో ప్రపంచ



తుమ్మపాల పీహెచ్‌సీలో బీపీ పరీక్షిస్తున్న వైద్యురాలు నజరత్ షమీమ్

రక్తపోటు దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారన్నారు. హై బీపీ ఉండడం వల్ల గుండె ఆరోగ్యంగా లేకపోవడం, స్ట్రోక్, మూత్రపిండాల వైఫల్యం వంటివి ప్రభావితం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు, పీహెచ్ఎన్‌లు, సూపర్‌వైజర్‌లు, పారా మెడికల్ సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

'వరి విత్తనాలు సరాఫరా చేయాలి'

నాతవరం, మే 17 : రైతులకు వరి విత్తనాలను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు కోరారు. టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఖరీఫ్‌కు పల్లపు ప్రాంత రైతులు జూన్‌లోనే వరి నారు వేస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు ఉంచాలని కోరారు. గత ఏడాది మండలంలో వరి విత్తనాలు అరకొరగా సరఫరా చేశారన్నారు. దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు చెప్పారు. ఆర్‌బీకేల వద్ద విత్తనాల కోసం రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న నిబంధనలు పెట్టకుండా డబ్బులు చెల్లించిన వారికి వెంటనే విత్తనాలు అందేలా చూడాలన్నారు. అలాగే మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఏర్పడిన పంట నష్టపరిహారం కోసం ఆయా రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్నికలు ముగిసినందున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

పరిహారమా.. పరిహాసమా!

... 5వ పేజీ తరువాయి

సకాలంలో చెల్లించకపోతే ఎలా? అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం సొమ్ము అందేలా చర్యలు చేపట్టాలని రైతులు వేడుకొంటున్నారు. పరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎన్నికల నేపథ్యంలో నగదు జమ కావడం ఆలస్యం అయ్యిందని, ఒకటి రెండు రోజుల్లో అర్హులందరికీ బ్యాంకు ఖాతాల్లో పరిహారం నగదు జమ అవుతుందని తెలిపారు.

అందాల తీరం.. అభివృద్ధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

షికారు, పిల్లలు ఆడుకునేందుకు పార్కులు లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ దీపాలు చాలా వరకు పని చేయకపోవడంతో తీరంలో అంధకారం రాజ్యమేలుతుంది. దీని వల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

తిక్కవానిపాలెం తీరంలో ఇలా..

సింహాద్రి ఎన్టీపీసీ నీటి అవసరాల నిమిత్తం తిక్కవానిపాలెం తీరంలో నిర్మించిన జెట్టీ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పర్యాటకుల కోసం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సముద్రం ఒడ్డున మూడు సిమెంట్ గొడుగులు నిర్మించినా అవి ఎటూ సరిపోవడం లేదు. జెట్టీ పైపులైన్ల కింద, సమీప జీడిమామిడితోటల్లో పర్యాటకులు సేద తీరుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. దీని వల్ల మహిళలు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి తీరంలో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

కొమరవోలు తల్లి జాతరకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించారు. అలాగే, స్థానిక వైసీపీ నాయకులు సైతం కూటమికే అనుకూలంగా పనిచేశారని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలోనే ముందస్తుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు సాంస్కృతిక కార్యక్రమాలను అడ్డుకున్నట్టు తెలిసింది.

జాతరకు ముందు రోజు చెపితే బాగుండేది : భక్తుల ఆవేదన

రాష్ట్రంలోని పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరుగుతున్నందున పోలీసు అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడం సబబే అయినప్పటికీ, ముందురోజు కనీసం 15వ తేదీ బుధవారం అభ్యంతరం తెలిపినా జాతరను వాయిదా వేసుకునేవారని గ్రామస్థులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇలా ఒక్కసారిగా ఆపివేయడం వల్ల అంతా తీవ్ర నిరాశకు గురయ్యామన్నారు. దీనిపై రోలుగుంట ఎస్ఐ సురేష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, జాతర నిర్వహణకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అనుమతి ఇవ్వలేదన్నారు. అలాగే, రాష్ట్రంలోని పలు చోట్ల తాజాగా జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడ్డుకున్నామని వివరించారు.

26 నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పరవాడ, మే 17 : ఈ-బోనంగి ఫార్మాసిటీ కాలనీ కొండపై కొలువైన భూసమేత అభయ వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులూ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులంతా అధికసంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తాళ్లపాలెం సంతలో షెడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



సంతలో షెడ్లు నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కశింకోట, మే 17: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో షెడ్ల నిర్మాణానికి గ్రామ స్వరాజ్య సేవ సమితి, నాబార్డ్, పంచాయతీ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు డాక్టర్ గల్లా రాజు మాట్లాడుతూ.. సంతలో 60మంది చిరు వ్యాపారులకు అనువుగా గ్రామ స్వరాజ్య సేవా సమితి ఆధ్వర్యంలో 2 షెడ్లు, 2 టాయిలెట్లు నిర్మాణం చేయనున్నామన్నారు. అంతేగాకుండా మేకలు షెడ్డు వద్ద సిమెంటుతో ఫ్లోరింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పుర్రె నర్సింగరావు, అప్పికొండ అప్పారావు, కర్రి సత్యనారాయణ, కర్రి గోవింద, కర్రి లోవరాజు, తోరం గణేష్, ముత్తా నాగేశ్వరరావు, గ్రామ స్వరాజ్య సమితి ఏటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా

పాడేరు, మే 17(ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా పడ్డాయి. ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింస, అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం తేల్చి చెప్పారు. ఒక వేళ ఉత్సవాలను నిర్వహించుకోవాలనుకుంటే, ఎటువంటి హడావిడి లేకుండా కేవలం ఆలయంలో అమ్మవారికి పూజలతోనే సరిపెట్టాలని సూచించారు. దీంతో ఉత్సవాలను నిర్వహించలేమని, తాజా ఘటనల నేపథ్యంలో ఉత్సవాలను వాయిదా వేసి జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతిధులు పేర్కొన్నారు.

నేడు వాసవిమాత జన్మదిన వేడుకలు



అనకాపల్లి టౌన్, మే 17 : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ తెలిపింది. శనివారం తెల్లవారుజామున నుంచి వివిధ పూజలు, అభిషేకాలు, హోమాలు, పేదమహిళలకు చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, సాయంత్రం ఐదు గంటలకు 102 రకాల మిఠాయిలతో అమ్మవారికి నివేదన చేస్తామని కమిటీ పేర్కొంది. ఆరున్నర గంటలకు ఊంజల సేవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు కమిటీ తెలిపింది.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న విజయ్‌కుమార్

సబ్బవరం, మే 17 : స్థానిక గ్రేస్ ఆఫ్ గాడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇరువాడ కృప సహకార కేంద్రంలో శుక్రవారం 30 మంది వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలను సంస్థ చైర్మన్ పువ్వల విజయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేదలకు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పి.ప్రేమానందం, జాన్ విజయకుమార్, దినేశ్‌కుమార్, హవీలా, ఎస్. నాయుడు, స్మైలీ, దివ్యతేజ, రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో భవన నిర్మాణంపై ఫిర్యాదు

సబ్బవరం, మే 17: మండలంలోని గొల్లలపాలెం సర్వే నంబరు 197/19 ప్రభుత్వ పోరంబోకు భూమిలో 5 సెంట్లు కోరుకొండ పైడమ్మ ఆక్రమించి అక్రమంగా పక్కాభవన నిర్మిస్తున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన మజ్జి అప్పలనర్సమ్మ, లక్ష్మి, ఎస్ ధనలక్ష్మి తహసీల్దార్‌కు, అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో నిర్మాణం ప్రారంభించినప్పుడు గ్రామస్థులందరూ అడ్డుకొని కోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి నిర్మాణం నిలిపేసి ఇటీవల ఎన్నికల సమయంలో నిర్మాణం పనులు ప్రారంభించారన్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కంపుకొడుతున్న బర్మా కాలనీ



బర్మాకాలనీ వద్ద రోడ్డుపై చెత్తకుప్ప

అనకాపల్లి టౌన్, మే 17 : స్థానిక నరసింగరావుపేటకు ఆనుకుని ఉన్న బర్మాకాలనీ రోడ్డులో చెత్తకుప్ప కంపుకొడుతోంది. గత మూడు రోజులుగా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు చెత్తకుప్పను తొలగించకపోవడంతో రోజు రోజుకి కుప్ప విస్తరించిందని స్థానికులు చెబుతున్నారు. ఒక పక్క వర్షాలు కురుస్తూ మరో పక్క ఎండ అధికంగా ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుందని పేర్కొన్నారు. ఈ కారణంగా దోమల బెడద కూడా అధికమైందని వాపోతున్నారు. డస్ట్‌బిన్ నిండిపోవడంతో మరో మార్గం లేక ఇళ్లలోని చెత్తను డస్ట్‌బిన్ ముందు వేస్తున్నారు. ఈ కారణంగా చెత్తకుప్ప రోజు రోజుకి విస్తరించి రోడ్డు మార్గాన వెళ్లే వారికి దుర్వాసన వెదజల్లుతోంది.

పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా

- రాష్ట్రంలో పలు అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో తేదీల మార్పు
- జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయం



పాడేరు, మే 17(ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా పడ్డాయి. ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింస, అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం తేల్చి చెప్పారు. ఒక వేళ ఉత్సవాలను నిర్వహించుకోవాలనుకుంటే, ఎటువంటి హడావిడి లేకుండా కేవలం ఆలయంలో అమ్మవారికి పూజలతోనే సరిపెట్టాలని సూచించారు. దీంతో ఉత్సవాలను నిర్వహించలేమని, తాజా ఘటనల నేపథ్యంలో ఉత్సవాలను వాయిదా వేసి జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతిధులు పేర్కొన్నారు.

సూర్యోదయం.. అరుణ వర్ణ శోభితం



కాన్వాస్‌పై కుంచెతో రంగులు అద్దినట్టు అరుణ వర్ణంలో ఆకాశం అందంగా కనిపించింది. వడ్డాదిలో శుక్రవారం సూర్యోదయం ఆహ్లాదాన్ని పంచింది. ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. దీంతో ఉత్సాహంగా ఫొటోలు తీసుకున్నారు. - బుచ్చెయ్యపేట

కొమరవోలు తల్లి జాతరకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించారు. అలాగే, స్థానిక వైసీపీ నాయకులు సైతం కూటమికే అనుకూలంగా పనిచేశారని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలోనే ముందస్తుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు సాంస్కృతిక కార్యక్రమాలను అడ్డుకున్నట్టు తెలిసింది.

జాతరకు ముందు రోజు చెపితే బాగుండేది : భక్తుల ఆవేదన

రాష్ట్రంలోని పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరుగుతున్నందున పోలీసు అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడం సబబే అయినప్పటికీ, ముందురోజు కనీసం 15వ తేదీ బుధవారం అభ్యంతరం తెలిపినా జాతరను వాయిదా వేసుకునేవారని గ్రామస్థులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇలా ఒక్కసారిగా ఆపివేయడం వల్ల అంతా తీవ్ర నిరాశకు గురయ్యామన్నారు. దీనిపై రోలుగుంట ఎస్ఐ సురేష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, జాతర నిర్వహణకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అనుమతి ఇవ్వలేదన్నారు. అలాగే, రాష్ట్రంలోని పలు చోట్ల తాజాగా జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడ్డుకున్నామని వివరించారు.

పరిహారమా.. పరిహాసమా!

... 5వ పేజీ తరువాయి

సకాలంలో చెల్లించకపోతే ఎలా? అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం సొమ్ము అందేలా చర్యలు చేపట్టాలని రైతులు వేడుకొంటున్నారు. పరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎన్నికల నేపథ్యంలో నగదు జమ కావడం ఆలస్యం అయ్యిందని, ఒకటి రెండు రోజుల్లో అర్హులందరికీ బ్యాంకు ఖాతాల్లో పరిహారం నగదు జమ అవుతుందని తెలిపారు.

అందాల తీరం.. అభివృద్ధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

షికారు, పిల్లలు ఆడుకునేందుకు పార్కులు లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ దీపాలు చాలా వరకు పని చేయకపోవడంతో తీరంలో అంధకారం రాజ్యమేలుతుంది. దీని వల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

తిక్కవానిపాలెం తీరంలో ఇలా..

సింహాద్రి ఎన్టీపీసీ నీటి అవసరాల నిమిత్తం తిక్కవానిపాలెం తీరంలో నిర్మించిన జెట్టీ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పర్యాటకుల కోసం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సముద్రం ఒడ్డున మూడు సిమెంట్ గొడుగులు నిర్మించినా అవి ఎటూ సరిపోవడం లేదు. జెట్టీ పైపులైన్ల కింద, సమీప జీడిమామిడితోటల్లో పర్యాటకులు సేద తీరుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. దీని వల్ల మహిళలు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి తీరంలో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.



బీటలువారి ఉన్న గోడౌన్ గోడలు



శిథిలమై నిరుపయోగంగా ఉన్న ఈ భవనంలో సేదదీరుతున్న కూలీలు

శిథిలావస్థలో జీసీసీ భవనాలు

- కొయ్యూరు మండలంలోని 53 డీఆర్‌డీ పోలు, 20 ఆశ్రమ పాఠశాలలకు ఇక్కడి నుంచే నిత్యావసర సరకుల తరలింపు
- దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో బీటలు వారిన గోడలు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని కళాసీలు, సిబ్బంది హడల్

కృష్ణాదేవిపేట, మే 17 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల గిరిజన సహకార సంస్థ (జీసీసీ) భవనాల దుస్థితి దారుణంగా ఉంది. శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ జీసీసీ గోడౌన్ నుంచి కొయ్యూరు మండలంలో గల 53 డీఆర్‌డీపోలు, 20 ఆశ్రమ పాఠశాలలకు సుమారు 429 టన్నుల బియ్యం, పప్పులు, నూనె, ఉప్పు తదితర నిత్యావసర సరకులు పంపిణీకి తరలిస్తుంటారు. ఇందుకోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సరకులను ఈ గోడౌన్‌లో భద్రపర్చుతుంటారు. అనంతరం డిపోలకు వాహనాల ద్వారా సదరు సరకులను పంపిస్తుంటారు. దీంతో నిత్యం ఇక్కడ సందడిగా ఉంటుంది.



కృష్ణాదేవిపేటలో శిథిలావస్థకు చేరిన గిరిజన సహకార సంస్థకు చెందిన భవనం

ఇటువంటి సమయంలో భవనం గోడలు ఎక్కడ కూలుతాయోనని ఇటు సిబ్బంది, అటు కళాసీలు, సరకుతో వచ్చే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని 1956లో అప్పటి ప్రభుత్వ నిర్మించింది. ప్రస్తుతం భవనం గోడలు పగుళ్లు ఏర్పడాయి. వర్షాలకు పూర్తిగా కారిపోతోంది. దీంతో సరకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేసేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలావుంటే, పనుల అనంతరం కార్మికులు కాసేపు సేదదీరేందుకు ఇప్పటికీ సరైన భవనం లేదు. తనిఖీలకు వచ్చే అధికారుల వద్ద వీరు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

గత్యంతరం లేక పెట్రోల్ బంకు పక్కన ఉన్న జీసీసీకి చెందిన పాత భవనంలో సేదదీరుతున్నారు. ఇది పూర్తిగా శిథిలం కావడంతో నిరుపయోగంగా ఉంది. కూలీలు అందులో ఉండే సమయంలో కూలితే పెద్ద ప్రమాదం తప్పదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీసీసీ ఉన్నతాధికారులు ఈ భవనం దుస్థితిపై తక్షణమే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

గ్రామాల్లో జోరుగా బెట్టింగ్‌లు

- టీడీపీ తరపున బరిలో ఉన్న 'బండారు'కు మంచి మెజారిటీ అని కొందరు..
- వైసీపీ నుంచి పోటీ చేస్తున్న అనురాధ గెలుపు ఖాయమని మరికొందరు పందేలు
- మధ్యవర్తుల వద్ద లోపాయికారీగా ఒప్పంద పత్రాలు రాసుకుంటున్నట్టు సమాచారం

మాడుగుల, మే 17 : సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన మాడుగుల నియోజకవర్గ అభ్యర్థుల గెలుపుపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 13వ తేదీన ఈ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాన పార్టీకుల చెందిన అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. అయితే దీనిపై పలు గ్రామాల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. కూటమి మద్దతుతో టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బండారు సత్యనారాయణమూర్తి ఐదు వేల నుంచి పది వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని పలువురు పందేలు కాస్తుండగా, వైసీపీ నుంచి బరిలో ఉన్న బూడి ముత్యాలనాయుడు కుమార్తె అనురాధ విజయం సాధిస్తారని మరికొందరు బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇందుకు సంబంధించి మధ్యవర్తుల వద్ద లోపాయికారీగా పలువురు అగ్రిమెంట్లు కూడా రాసుకుంటున్నట్టు సమాచారం. దీంతో అంతటా ఉత్కంఠ నెకొంది. దీనికి తెరపడాలంటే అంతా మరో పదిహేనురోజులు వేచి ఉండక తప్పని పరిస్థితి

రాజాంలో పూరిల్లు దగ్ధం

- రూ. మూడు లక్షల ఆస్తి నష్టం

బుచ్చెయ్యపేట, మే 17 : రాజాంలో శుక్రవారం పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో మూడు లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. గ్రామానికి చెందిన గొర్లె శ్రీను ఇంటి విద్యుత్ కనెక్షన్ నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో గ్యాస్ సిలెండర్ పేలిపోవడంతో మంటలు మరింతగా చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న రూ. 95వేల నగదు, రెండు తులాల బంగారం, టీవీ, సామగ్రి మొత్తం కాలిబూడిదయ్యాయి. నిరాశ్రయులుగా మారిన శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాల్సిందిగా సర్పంచ్ మరిసా నాని కోరారు.

కొమరవోలులో ఇంటింటికీ తాగునీరు సరఫరా

- అడుగంటిన భూగర్భ జలాలు
- ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న టీడీపీ నాయకులు



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

రోలుగుంట, మే 17 : మండలంలోని కొమరవోలులో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మంచినీటి సరఫరాను చేపట్టారు. మండుతున్న ఎండల కారణంగా భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోర్లకు నీరందని పరిస్థితి నెలకొంది.ఇది గుర్తించిన సదరు పార్టీ సీనియర్ నాయకులు పోతల శ్రీనివాసరావు, బోళెం రమేష్ తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రోలుగుంట నుంచి ట్యాంకులను తెప్పించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ వేసవి ముగిసే వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా సదరు నాయకులు విలేకరులకు వివరించారు. టీడీపీ నాయకుల సేవలపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు కలిసొచ్చిన వర్షాలు

- భూమి పదునుగా ఉండడంతో చకచకా పనులు
- కూలి గిట్టుబాటు కాగలదని ఆశాభావం



గుమ్మాళ్ళపాడులో పనులకు వెళుతున్న కూలీలు



మత్స్యవానిపాలెంలో చెరువులో పూడిక తీస్తున్న దృశ్యం

రావికమతం, మే 17 : ఇటీవల కురిసిన వర్షాలు ఉపాధి కూలీలకు కలిసి వచ్చింది. భూమి పదునుగా ఉండడంతో పూడికతీత పనులు సులభతరంగా, వేగంగా సాగుతుండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు నిర్దేశించిన పనిని చకచకా పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని చినపాచిల పంచాయతీలో మినహా మిగిలిన అన్ని గ్రామాలలో పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు చెరువుల్లో పూడిక తీతలు , పంటకాలువుల అభివృద్ధి, నేల బావుల అభివృద్ధి, ఫారమ్ పాండ్స్, పంట పొలాలకు మట్టి రోడ్లు ఏర్పాటు, సరిహద్దు కందకాలు ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నారు. అయితే మార్చి, ఏప్రిల్, మే ఈ మూడు నెలలు ఎండల తీవ్రత కారణంగా మట్టి పనులే అయినప్పటికీ భూమిలో తగినంత తేమ లేక సరిగా పనులు సాగవు. కూలీలకు కూలి డబ్బులు కూడా గిట్టుబాటు కావు. కానీ ఇటీవల మండు వేసవిలో సైతం వర్షాలు కురుస్తుండడంతో భూమి పదునుగా ఉండడం వల్ల పనులు ఊపందుకున్నాయి. దీనివల్ల రోజు కూలి రూ.300 పొందే అవకాశం ఉందని పలువురు కూలీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ వర్షాలు తమకు అనుకూలంగా మారాయని వారు అంటున్నారు.

'సనాతన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిది'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

మాడుగుల, మే 17 : తెలుగు జాతి సంప్రదాయాలు, సనాతన ధర్మాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదికవి నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. పట్టణంలోని మోదకొండమ్మ అమ్మవారి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంప్రదాయ, సాంస్కృతి, సనాతన ధర్మం ప్రాముఖ్యతలపై ఏర్పాటైన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల చైతన్యం పెంచే విధంగా గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో కమిటీలు వేసి ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్, ఆర్కే ప్రసాదరావు, తవ్వ సన్యాసిశెట్టి, లలిత, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

పరవాడ, మే 17 : ఈ-బోనంగి ఫార్మాసిటీ కాలనీ కొండపై కొలువైన భూసమేత అభయ వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులూ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులంతా అధికసంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి : ఎంపీడీవో



'క్రాష్'లో భాగంగా ఆటోను జెండా ఊపి ప్రారంభిస్తున్న అధికారులు

చీడికాడ, మే 17 : వేసవిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాల్లో మూలకు చేరిన బోర్ల మరమ్మతుపై దృష్టి సారించామన్నారు. మండల వ్యాప్తంగా 800 మంచినీటి బోర్లు ఉన్నాయన్నారు. జూన్ 30వరకూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ఆయా గ్రామాల్లో పాడైన బోర్లను గుర్తించి బాగుచేయనున్నామని వివరించారు. ఇందుకు సంబంధించిన సామగ్రితో వెళుతున్న ఆటోను ఆమె శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రతి పంచాయతీలో బోర్లను మెకానిక్‌లు పరిశీలించాలన్నారు. ఒకవేళ పాడైతే వెంటనే స్పందించి తమ వద్ద ఉన్న మెటీరియల్‌తో బాగు చేయాలన్నారు. ఇదిలావుంటే, ఈ 'క్రాష్' ప్రోగ్రామ్‌ను మార్చి ఒకటో తేదీన ప్రారంభించాల్సి ఉంది. ఇంతకాలం జాప్యానికి గల కారణాలను ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ శ్రీకాంత్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఇంతవరకూ చిన్నచిన్న రిపేర్లు చేస్తున్నామన్నారు. పెద్ద పెద్దరిపేర్లకు అవసరమైన సామగ్రిని ఆయా గ్రామాలకు తీసుకువెళ్లేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆటో ఏర్పాటు చేశారన్నారు.

'ఖరీఫ్‌కు వరి విత్తనాలు సరాఫరా చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

నాతవరం, మే 17 : రైతులకు వరి విత్తనాలను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు కోరారు. టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఖరీఫ్‌కు పల్లపు ప్రాంత రైతులు జూన్‌లోనే వరినారు వేస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని రైతు భరోసా కేంద్రాలకు రైతులకు అవసరమైన విత్తనాలు వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గత ఏడాది మండలంలో వరివిత్తనాలు అరకొరగా సరఫరా చేశారన్నారు. దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు చెప్పారు. ఆర్‌బీకేల వద్ద విత్తనాల కోసం రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్న నిబంధనలు పెట్టకుండా డబ్బులు చెల్లించిన వారికి వెంటనే విత్తనాలు అందేలా చూడాలన్నారు. అలాగే మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఏర్పడిన పంట నష్ట పరిహారం కోసం ఆయా రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్నికలు ముగిసినందున ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. ఇదిలావుంటే, తాండవ మెయిన్ గేట్ల నుంచి లీకేజీల రూపంలో వృథాగా నీరు పోతున్నందున గేట్లకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఇటంశెట్టి సీతారామ్మూర్తి, మండల తెలుగురైతు అధ్యక్షుడు పైల సూరిబాబు పాల్గొన్నారు.

కాపు సామాజిక భవనం బిల్లు నిలిపివేతపై ఫిర్యాదు

- టీడీపీ హయాంలో 40 శాతం నిర్మాణం
- జరిగిన పనులకు బిల్లు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో అధికారుల్లో కదలిక



భవన నిర్మాణం పూర్తి చేయాలని వినతిని అందిస్తున్న కాలనీ వాసులు

బుచ్చెయ్యపేట, మే 17 : వడ్డాది ఈబీసీ కాలనీలో చేపట్టిన కాపు సామాజిక భవనానికి సంబంధించిన బిల్లు చెల్లించకపోవడంపై సదరు కాంట్రాక్టరు గత నెల స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వివరాలు సేకరించారు. 2019లో గత టీడీపీ ప్రభుత్వం వడ్డాది ఈబీసీ కాలనీలో ఈ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను టెండరు ద్వారా దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ 40 శాతంపైగా భవన నిర్మాణ పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లు పెట్టారు.

ఈ దశలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. గద్దెనెక్కి ఐదేళ్లు గడిస్తున్నా చేసిన పనులకు బిల్లు చేయకుండానిలిపివేయడంపై సదరు కాంట్రాక్టర్ ఏప్రిల్‌లో కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎన్నికలు ముగియడంతో స్పందనలో ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టారు. జరిగిన నిర్మాణ పనులను పరిశీలించారు. చేసిన పనులకు బిల్లు మంజూరు చేసి, అసంపూర్తిగా నిలిచిన కాపు సామాజిక భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాలనీ వాసులు అధికారులను కోరారు.

ప్రభుత్వ కళాశాలల్లో పిల్లల్ని చేర్పించాలని ప్రచారం



జెడ్.కొత్తపట్నంలో కరపత్రాలు పంచుతున్న అధ్యాపకులు

రావికమతం, మే 17: అత్యుత్తమ విద్యా బోధన, ఉచిత సౌకర్యాలున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కొత్తకోట జూనియర్ కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులను కోరుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం వెళ్లి ఇటీవల పదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, తరగతి గదులన్నీ అధునిక సౌకర్యాలతో ఉన్నాయని, లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని చెపుతున్నారు. ఇందులో భాగంగా జెడ్.కొత్తపట్నం, దొండపూడి, టి.అర్జాపురం, నాయుడుపాలెం తదితర గ్రామాల్లోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి, అధ్యాపకులు తెలిపారు.